ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

శుక్రవారం 4 అక్టోబరు 2024


రైతుబజార్లలోనే కిలో రూ.66... నేడు రూ.79

రారెత్తిస్తున్న టమాటా

- బయట మార్కెట్‌లో రూ.90-రూ.100
- ఉల్లి ఘాటు..కిలో రూ.49
- కూరగాయల ధరలన్నీ కిలో రూ.40 పైనే...
- ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడం, ఉత్పత్తులు తగ్గడమే కారణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. టమాటా ధర వింటే కొనుగోలుదారులు ఠారెత్తిపోతున్నారు. రైతుబజార్లలో కిలో రూ.66 చొప్పున విక్రయిస్తుంటే బయట రూ.90 నుంచి రూ.100కు అమ్ముతున్నారు. ఉల్లి ధరలు అలాగే ఉన్నాయి. రైతుబజార్లలో కిలో రూ.49 ఉండగా, బయట రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు.





ఇటీవల కురిసన భారీవర్షాల కారణంగా అన్నిరకాల పంటలు పోయాయి. దిగుబడి తగ్గిపోయింది. దాంతో ధరలు పెరిగిపోయాయి. మరోవైపు సీజన్ కూడా మొదలైంది. దసరా పూజలు మొదలు కావడంతో భవానీ మాలలు వేసుకునేవారంతా సామూహిక భోజనాలు చేస్తున్నారు. వారి వంటకాల కోసం టోకున కూరగాయలు కొంటున్నారు. బజార్లకు వచ్చిన సరకులు వచ్చినవి వచ్చినట్టే అయిపోతున్నాయి. టమాటా ధర రూ.66 అయినా సరే గురువారం రైతుబజార్లలో కొనడానికి కిలో కూడా దొరకలేదు. రేటు ఎక్కువ ఉందని డ్వాక్రా గ్రూపులు తేవడం లేదు. రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాలకు చిత్తూరు జిల్లా మదనపల్లె నుంచి టమాటా సరఫరా అవుతుంది. అక్కడ పూట పూటకు రేటు మారిపోతోంది. ఉత్తరాదిలో కూడా టమాటా దిగుబడి బాగా తగ్గిపోవడంతో అక్కడివారు మదనపల్లె వచ్చి ఎక్కువ రేటు పెట్టి కొని లారీలకు లారీలు తీసుకుపోతున్నారు. దాంతో గురువారం ఒక్కరోజే అక్కడ కిలోకు రూ.13 పెరిగి రూ.79 చొప్పున విక్రయించారు. అంటే శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇదే రేటు ఉంటుంది. దీనికి రవాణా చార్జీలు, తరుగు, లాభం అదనం. అంటే కనీసం కిలో రూ.90 చొప్పున టోకున విక్రయించాల్సి ఉంటుంది. బయట మార్కెట్‌లో అయితే 100 దాటిపోతుంది.

ఇతర కూరగాయల ధరలూ అలాగే ఉన్నాయి. రైతుబజార్లలో వంకాయలు రకాన్ని బట్టి కిలో రూ.40 నుంచి రూ.54 వరకు అమ్ముతున్నారు. బయట అయితే కిలో రూ.60 చెబుతున్నారు. బీరకాయలు కిలో రూ.48 కాగా బయట రూ.70 చేసి విక్రయిస్తున్నారు. కాలీఫ్లవర్ పువ్వు రైతుబజార్‌లో రూ.44 రేటు పెట్టగా బయట రూ.60కి అమ్ముతున్నారు. దొండకాయలు, క్యారెట్, బరబాటి తదితరాలన్నీ రైతుబజార్లలో కిలో రూ.44 దాటే అమ్ముతున్నారు.

అత్యవసరంగా జాయింట్ కలెక్టర్ సమావేశం

మార్కెట్‌లో కూరగాయలు, ఉల్లి, టమాటా ధరలు భారీగా పెరుగుతున్నాయని ... మిగతా 6వ పేజీలో

ఆదిలక్ష్మిగా శ్రీకనకమహాలక్ష్మి



బురుజుపేటలో ఆదిలక్ష్మిగా కొలువైన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు

జగదాంబ కూడలి, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని బురుజుపేటలో కొలువైన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు తొలిరోజు గురువారం ఆదిలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదిలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. శుక్రవారం నుంచి విజయదశమి పర్వదినం వరకు రోజుకో అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. శుక్రవారం ధనలక్ష్మి రూపంలో కొలువుదీరనున్న కనకమహాలక్ష్మికి లక్ష చామంతుల పూజ చేస్తారు. 5న ధాన్యలక్ష్మిగా, 6న ధైర్యలక్ష్మిగా, 7న సంతానలక్ష్మిగా, 8న విజయలక్ష్మిగా, 9న విద్యాలక్ష్మిగా, 10న గజలక్ష్మిగా, 11న మహాలక్ష్మిగా దర్శనమిస్తారు. 12న విజదశమి పర్వదినాన కనకమహాలక్ష్మిగా నిజరూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారికి స్వర్ణ కవచధారణ, స్వర్ణపుష్పాలతో అలంకరణ చేస్తారు.

గ్యాస్ కనెక్షన్లపై ఆరా

- జిల్లాల నుంచి సమాచారం సేకరణ
- 'మహాలక్ష్మి' పథకం కింద దీపావళి నుంచి ఏడాదికి మూడు సిలెండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 9,05,661
- బియ్యం కార్డులు 5,29,054...



విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): 'కూటమి' ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లో 'మహాశక్తి' పథకం ఒకటి. ఈ పథకం కింత పేద మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందిస్తామని ప్రకటించింది. ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది దీపావళి నుంచి ఈ పథకం అమలు చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించడంతో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు ప్రారంభించారు. జిల్లాల నుంచి బియ్యం కార్డులు, గ్యాస్ కనెక్షన్ల వివరాలు సేకరిస్తున్నారు. విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 9,05,661 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రెగ్యులర్‌తోపాటు దీపం, ఉజ్వల పథకం కింద అనేక మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో బియ్యం కార్డులు 5,29,054 ఉన్నాయి. నగరం, గ్రామీణ ప్రాంతాల్లో 3,76,607 గ్యాస్ కనెక్షన్లు ఉన్న కుటుంబాలకు బియ్యం కార్డులు లేవు.

జిల్లాలో 9,05,661 గ్యాస్ కనెక్షన్లు

విశాఖ జిల్లాలో అన్ని చమురు కంపెనీలకు సంబంధించి 55 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో సాధారణ గ్యాస్ కనెక్షన్లు 8,90,341 ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని ఐదు ఏజెన్సీల పరిధిలో సింగిల్ సిలెండర్లు ఉన్నవి 2,988, డబుల్ సిలెండర్లు ఉన్న కనెక్షన్లు 39,356 ఉన్నాయి. నగరంలో సింగిల్ సిలెండర్లు ఉన్నవి 2,21,616, డబుల్ సిలెండర్లు ఉన్న కనెక్షన్లు 4,94,632 ఉన్నాయి. దీపం పథకం కింద గ్రామీణ ప్రాంతంలో 7,632, నగరంలో 1,24,117 కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం వీరికి గ్యాస్ ... మిగతా 6వ పేజీలో

ఎక్సైజ్‌లో ఇష్టారాజ్యం

అంతా తానే అన్నట్టు వ్యవహరిస్తున్న ఓ అధికారి

- గుమస్తా నుంచి ఉన్నతాధికారి స్థాయికి...
- వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖ నిర్వీర్యం కావడంతో వేరే శాఖకు డిప్యుటేషన్
- కొత్తమద్యం పాలసీ అమల్లోకి రావడంతో తిరిగి ఎక్సైజ్ శాఖలోకి రాక
- కూటమి ప్రజా ప్రతినిధి అండతో నగరంలో కీలక పోస్టింగ్



- కిందిస్థాయి అధికారులకు చుక్కలు చూపిస్తున్నారంటూ ఆరోపణలు
- బదిలీల్లో భాగంగా వచ్చిన వారిని చేర్చుకోకుండా వేధింపులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో ఒక అధికారి అంతా తానే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. కూటమికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి అండదండలతో ఆయన కీలకమైన పోస్టు దక్కించుకున్నారు. బదిలీల్లో భాగంగా కొందరు అధికారులు విధుల్లో చేరేందుకు వస్తే వారిని చేర్చుకోకుండా వేధింపులకు గురిచేస్తున్నారు. వారి స్థానంలో తనకు అనుకూలమైన వారిని తెచ్చుకునేందుకు యత్నిస్తున్నారు. వైసీపీ హయాంలో చక్రం తిప్పిన సదరు అధికారి హవా ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా నడుస్తుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీ ప్రకటించడంతో వ్యాపారులతోపాటు ఎక్సైజ్ శాఖ అధికారుల్లోనూ హడావిడి మొదలైంది. 2019లో వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రభుత్వమే నిర్వహించేలా పాలసీని అమలుచేసింది. దీనివల్ల అప్పటివరకూ ప్రైవేటు మద్యం వ్యాపారుల నుంచి వచ్చే మామూళ్లు ఆగిపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులకు అదనపు ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. దీనికితోడు అక్రమ మద్యం, సారా, గంజాయి నియంత్రణ కోసం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పేరుతో కొత్త విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఆ విభాగంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బందిని 70 శాతం, పోలీసు అధికారులు, సిబ్బంది 30 శాతం ఉండేలా ఆదేశాలు జారీచేసింది. సెబ్ కార్యకలాపాలను పర్యవేక్షించడంతోపాటు అధికారులు, సిబ్బందికి అవసరమైన ఆదేశాలు ఇచ్చే అధికారాన్ని అదనపు ఎస్పీ స్థాయి కలిగిన సివిల్ పోలీస్ అధికారికి అప్పగించింది. దీంతో సెబ్‌లో కూడా ఎక్సైజ్ శాఖ అధికారులకు అధికారం, ఆదాయం లేకుండా పోయింది. వీటన్నింటి నేపథ్యంలో ఎక్సైజ్ శాఖలో పనిచేయడానికి చాలామంది అధికారులు, సిబ్బంది ఆసక్తి చూపేవారు కాదు. వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధులతో సత్సంబంధాలు కలిగినవారు డిప్యుటేషన్ పేరుతో ఇతర శాఖలకు వెళ్లిపోయారు. ఇదే తరహాలో 2014-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో గుమస్తా స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన అధికారి ఒకరు వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల సహకారంతో వేరొక శాఖకు కీలకమైన పోస్టులోకి డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. అప్పటివరకూ టీడీపీ ప్రభుత్వంలో కీలకమైన పోస్టులో పనిచేసిన సదరు అధికారి వైసీపీ ప్రభుత్వంలో కూడా అనుకున్నచోట పోస్టింగ్ తెచ్చుకోవడం ఎక్సైజ్ శాఖలోని ఇతర అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం తిరిగి ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుమతించనున్నట్టు ప్రకటించగానే డిప్యుటేషన్‌పై వేరే శాఖలో కొనసాగుతున్న సదరు అధికారి తిరిగి తన మాతృశాఖ అయిన ఎక్సైజ్‌కు వెళ్లిపోయేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు. నగరానికి చెందిన కూటమిలోని ఒక ... మిగతా 6వ పేజీలో

టెట్ ప్రారంభం



చినముషిడివాడలోని అయాన్ డిజిటల్ సెంటర్ వద్ద పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులను తనిఖీ చేసి లోపలకు పంపుతున్న సిబ్బంది

- తొలిరోజు ఎనిమిది కేంద్రాల్లో నిర్వహణ
- 87.48 శాతం హాజరు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం ప్రారంభమైంది. జిల్లాలో తొలిరోజు ఉదయం ఐదు, మధ్యాహ్నం మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్‌లో రెండు కేంద్రాలు, పెదగంట్యాడలోని ఎస్‌వీఎస్ టెక్నాలజీస్, బుచ్చిరాజుపాలెంలోని ఏడీజడ్ ఆరోహణ జోన్, మధురవాడ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 2,225 మందికిగాను 1,977 మంది (88.85 శాతం), మధ్యాహ్నం చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్‌లో రెండు కేంద్రాలు, బుచ్చిరాజుపాలెంలోని ఏడీజడ్ ఆరోహణ జోన్‌లో 1,706 మందికి 1,462 (85.69 శాతం) మంది...మొత్తం 3,931కి 3,439 మంది (87.48 శాతం) పరీక్షకు హాజరయ్యారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఫిబ్రవరిలో ఒకసారి టెట్ నిర్వహించారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో డీఎస్సీ నిర్వహణ అప్పట్లో అటకెక్కింది. ఎన్నికల తరువాత మెగా డీఎస్సీ నిర్వహణ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతకం చేశారు. దీంతో మరోమారు టెట్ నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో పరీక్ష రాసిన వారిలో అత్యధికులు మెరుగైన మార్కుల కోసం మళ్లీ పరీక్ష రాస్తున్నారు. కాగా పరీక్షా కేంద్రాలను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర్ ప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సందర్శించారు. కేంద్రాల్లో అభ్యర్థులకు తగిన వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

హరిబాబుకు నాగార్జున పరామర్శ



మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబును గురువారం ఆయన ఇంటి వద్ద పరామర్శిస్తున్న సినీ నటుడు అక్కినేని నాగార్జున - వార్త 6వ పేజీలో...

దసరాకు ఆర్టీసీ స్పెషల్స్

- రీజియన్ నుంచి 250 సర్వీస్‌లు
- దూరప్రాంతాలకు 150
- ఉత్తరాంధ్రలోని ఇతర జిల్లాలకు 100
- నేటి నుంచి ప్రారంభం



ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 3: దసరా ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం 250 స్పెషల్ సర్వీసులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి ఈ ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేయనున్నది. దూర ప్రాంతాలైన హైదరాబాద్, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు 150 సర్వీసులు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు వంద బస్సులు నడిపేందుకు నిర్ణయించింది. శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతామని రీజనల్ మేనేజర్ అందవరపు అప్పలరాజు వెల్లడించారు. హైదారాబాద్‌కు 37, విజయవాడకు 60, అమలాపురానికి 3, కాకినాడకు 25, రాజమండ్రికి 25 చొప్పున ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. దూర ప్రాంతా లకు గరుడ, అమరావతి, నైట్ రైడర్, గరుడ ప్లస్, సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్, అల్ట్రా డీలక్ కేటగిరీ సర్వీసులు ఆపరేట్ చేయనున్నారు. జోనల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, పాలకొండ, రాజాం, ఇచ్ఛాపురం, సాలూరు, టెక్కలి, పలాస, సోంపేట ప్రాంతాలకు 100 స్పెషల్ సర్వీస్‌లు ఆపరేట్ చేసేందుకు షెడ్యూల్ తయారుచేశారు. అల్ట్రా డీలక్స్, మెట్రో, మెట్రో లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కేటాయించనున్నారు. ప్రత్యేక సర్వీస్‌లలో కూడా ... మిగతా 6వ పేజీలో

పర్యాటక అక్రమాలపై విచారణ

- మేర్లిన్ కేఫ్, తొట్లకొండ బే వాచ్ రిసార్ట్స్‌ను పరిశీలించిన సభ్యులు
- రుషికొండ బీచ్‌ను కూడా...
- నిర్వహణపై ఆరా...
- రిజిస్టర్‌లో హాజరుకు, అక్కడ ఉన్న సిబ్బందికీ పొంతన లేదని గుర్తింపు



రుషికొండలో సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న విచారణ కమిటీ సభ్యులు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ లీజులు, ఇతర అంశాలపై వచ్చిన ఆరోపణలపై కొత్తగా ఏర్పాటైన విజిలెన్స్ కమిటీ గురువారం ఇక్కడకు వచ్చి విచారణ ప్రారంభించింది. తొలుత భీమిలి సమీపాన ఉన్న మేర్లిన్ కేఫ్‌నకు వెళ్లి ఏ కారణాలతో కోటి రూపాయలకు పైగా లీజు మొత్తం బకాయి పడ్డారో ఆరా తీసింది. ఆ తరువాత రుషికొండ బీచ్‌కు వెళ్లి అక్కడ వాటర్ స్పోర్ట్స్, బీచ్ నిర్వహణపై విచారణ చేపట్టింది. ఎన్ని బోట్లు నడుస్తున్నాయి?, వాటికి టికెట్ ధర ఎంత నిర్ణయించారు?...అనే వివరాలు తెలుసు కుంది.బీచ్ నిర్వహణకు ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు?, వారిలో ఎందరు విధులకు హాజరయ్యారు?...అనే వివరాలు ప్రశ్నించారు. రిజిస్టర్‌లో హాజరుకు, బీచ్‌లో ఉన్న సిబ్బంది లెక్కకు పొంతన లేకపోవడాన్ని గుర్తించారు. బీచ్‌లో తిరిగి నిర్వహణ తీరు తెన్నులు తెలుసుకున్నారు. సాయంత్రం అయ్యాక తొట్లకొండ వెళ్లి బే వాచ్ రిసార్ట్‌ను పరిశీలించారు. అయితే చీకటి పడ్డాక కంటే...పగటి పూట వెళితేనే అక్కడ అక్రమంగా నిర్మించిన కాటేజీలను గుర్తించడానికి వీలవుతుందని ఆ శాఖకు చెందిన సిబ్బంది చెబుతున్నారు.

కమిటీ నియామకంపై ఆరోపణలు

తొలుత నాటి పర్యాటక శాఖా మంత్రి రోజా ఓఎస్‌డీగా పనిచేసిన మనోహర్ అనే అధికారిని విశాఖలో అక్రమాలపై విచారణకు పంపించారు. వైసీపీ హయాంలో జరిగిన ... మిగతా 6వ పేజీలో



మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో సీతంపేట పార్వతీదేవి



బాలా త్రిపుర సుందరిగా డాబాగార్డెన్స్ ఉమాదేవి అమ్మవారు



మధుసూదన్ నగర్‌లో కొలువైన అమ్మవారు



సీతంపేటలో రాములోరు అవతారంలో వెంకటేశ్వరస్వామి

అంతటా 'అమ్మ' స్మరణ

- వాడవాడలా భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన శరన్నవరాత్రి మహోత్సవాలు

జగదాంబ కూడలి, అక్టోబరు 3: భక్తులు 'అమ్మ'గా, కొంగుబంగారంగా, ఆదిపరాశక్తిగా ఆరాధించే దుర్గాదేవి (శరన్నవరాత్రులు) ఉత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో కొలువైన అమ్మవార్లను వివిధ రూపాల్లో కొలువుదీర్చారు. వన్‌టౌన్ కనకమహాలక్షిని ఆదిలక్ష్మి రూపంలో భక్తులు దర్శించుకున్నారు. బురుజుపేటలోని కనక మహాలక్ష్మి అమ్మవారి లక్ష కుంకుమార్చన పూజల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈవో కె.శోభారాణి, జేఈవో తిరుమలేశ్వరరావు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు ఆహ్వానం పలికారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ అర్చకులు భక్తితో అమ్మవారికి కుంకుమ పూజ జరిపించారు. ఆదిలక్ష్మి రూపంలో అమ్మవారిని చూసి భక్తులు తన్మయంతో మొకరిల్లారు.



కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవికి అర్చకులు జి.భార్గవశర్మ సంప్రదాయ రీతిలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో జీవీ రమాభాయి, ఎం.మన్మథరెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: మధుసూదన్‌నగర్‌లోని స్వాగతద్వారం నుంచి కలశంతో ఊరేగింపుగా లక్ష్మీగణపతి సహిత కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని కలశ ప్రతిష్ఠ చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శీరంశెట్టి శంకర్, లక్ష్మి దంపతులచే ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, చదువుల పరమానందరావులు కలశపూజ చేయించారు. శుక్రవారం అమ్మవారిని ఊరేగించి, భక్తుల స్వహస్తాలతో పాలు, జలాభిషేకం చేయనున్నారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయి. 9న సామూహిక అక్షరాభిషేకం, దుర్గాష్టమి నాడు ఉదయం నుంచి హోమం జరుగుతుంది. రోజూ సాయంత్రం అమ్మవారికి లలితా సహస్రనామం, అమ్మవారి ఖడ్గమాల జరుగుతుంది. మధుసూదన్‌నగర్ గ్రామాధ్యక్షుడు కలిమిరెడ్డి అప్పారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు వానపల్లి వెంకటరావు, గురి ఈశ్వరరావు, తెడ్లపు అప్పారావు, గొందేశి కనకరెడి, ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని గంగన్ననగర్, రెడ్డి కంచరపాలెం, కొత్తవాడ వీధి, గొల్ల కంచరపాలెం, రవీంద్ర నగర్ , ఐటీఐ జంక్షన్‌లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. తొలి రోజు బాల త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

సీతంపేట: సీతంపేటలోని పార్వతీశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం చేయించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహిళలతో సామూహిక కుంకుమార్చన, చండీ హోమం చేయించారు. ఆలయ అర్చకులు శివాజి శర్మ, భాస్కర శర్మ అర్చక బృందం పూజల్లో పాల్గొంది.

సీతమ్మధార: సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల షిరిడి సాయిబాబా, వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా, వెంకటేశ్వరస్వామిని రాములోరుగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని బాలత్రిపుర సుందరి అవతారంలో భక్తులు పల్లకిపై సీతమ్మధార కృష్ణమందిరం ప్రాంతంలో ఊరేగించినట్లు ఈఓ బండారు ప్రసాద్ తెలిపారు. పూజ కార్యక్రమంలో బీజెపి నాయకురాలు శ్యామలదీపిక పాల్గొని అన్నదాన కార్యక్రమంలో భక్తులకు వడ్డించారు.

ఐటీఐ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కమిటీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్, తదితరులు

కంచరపాలెం, అక్టోబరు 3: ప్రభుత్వ ఐటీఐల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంఘ కార్యవర్గ ఎన్నిక గురువారం కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో జరిగింది. సంఘ నాయకులు కె.శ్రీనివాసరావు, బి.రవికుమార్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పి.బాలాజీ (ట్రైనింగ్ ఆఫీసర్), ఉపాధ్యక్షుడిగా కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఎ.జయలక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా బి.సత్యనారాయణ, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా ఐవీ కుమార్, లక్ష్మణరావులు ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ ఉమాశంకర్ అభినందించారు.

రోజుకు 90 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయండి

మహారాణిపేట, అక్టోబరు 3: ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో రోజుకు 90 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇళ్ల నిర్మాణం, ఇతర అంశాలపై సమీక్షించారు. లే అవుట్‌ల వారీగా చేపట్టవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకోవాలని తెలిపారు.

మహిళల్లో రక్తహీనతను గుర్తించాలి

మహారాణిపేట, అక్టోబరు 3: మహిళల ఆరోగ్యంపై రక్తహీనత ఎక్కువగా ప్రభావితం చేస్తుందని, అందువల్ల దీన్ని గుర్తించటం చాలా ప్రధానమని ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రెట్రిక్ ప్రెసిడెంట్ డాక్టర్ జయదీప్ ట్యాంక్ అన్నారు. గురువారం హెల్త్‌కేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహారాణిపేటలోని వైద్యుల సమావేశమందిరంలో ఆయన మాట్లాడారు. దేశంలో 50 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, ఎక్కువ కాలం చికిత్స అందించకపోతే వారి ఆరోగ్యం, శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్చరించారు. పౌష్టికాహార లోపం దీనికి ప్రధాన కారణమని తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రచారం చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో డైరెక్టర్ మిలింద్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మానసిక రోగి

అక్కయ్యపాలెం, అక్టోబరు 3: ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న బిశ్వజిత్ (50)ను పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బంకుర జిల్లాలోని మదన్ మోహన్‌పూర్ గ్రామంలోని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అతని మానసిక పరిస్థితి బాగులేకపోవడంతో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించడంతో కోలుకున్నాడని, దీంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. ఆయన సోదరుడు బాంగీస బదన్ కుటుంబ సభ్యులతో రావడంతో వారికి బిశ్వజిత్‌ను అప్పగించినట్లు చెప్పారు.

చెత్తపన్ను రద్దుపై వార్వా, నివాస్ హర్షం

అక్కయ్యపాలెం: చెత్త పన్ను రద్దు నిర్ణయంపై విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా), గ్రేటర్ విశాఖ రెసిడెంట్ కాలనీ అసోసియేషన్ ఫెడరేషన్ (నివాస్) ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. 2021లో ప్రతి ఇంటికి నెలకు రూ.120 వంతున చెత్త సేకరణ చార్జీలు గత ప్రభుత్వం విధించిందని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వం దీన్ని రద్దు చేయడం ఆనందంగా ఉందన్నారు.

కంచరపాలెం: చెత్త పన్నును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై ఇంటక్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విధించిన చెత్తపన్నుపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది .కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పన్నును రద్దు చేస్తూ జీవోను విడుదల చేయడంతో ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరపు రెడ్డి కొండబాబు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో చిన్న వర్తకులు, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

మిజోరం గవర్నర్ హరిబాబుకు నాగార్జున పరామర్శ

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మిజోరం గవర్నర్, విశాఖపట్నం మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబును గురువారం సినీ నటుడు అక్కినేని నాగార్జున పరామర్శించారు. హరిబాబు ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విశాఖలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సినిమా షూటింగ్ నిమిత్తం విశాఖలో ఉన్న నాగార్జున మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తో కలిసి హరిబాబు నివాసానికి వెళ్లి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పార్కులో భద్రతకు ప్రాధాన్యం: సీఐ

మాధవధార, అక్టోబరు 3: వైశాఖీ స్పోర్ట్స్ పార్కు వేదికగా బుధ, గురువారాల్లో నిర్వహించిన మహాత్మాగాంధీ మెమోరియల్ రోల్ బాల్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. టోర్నమెంట్ విజేతలకు కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ బహుమతులు అందించి క్రీడాకారులను, నిర్వాహకులను అభినందించారు. క్రీడలు, వ్యాయామం, ఆహ్లాదానికి నెలవైన పార్కులో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం పార్కు పరిసరాల్ని పరిశీలించిన సీఐ గతంలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించారు. అల్లరి మూకలు పార్కులో ఇబ్బంది పెట్టిన ఘటనలపై కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌ని అడిగి తెలుసుకున్నారు. పార్కులో సీసీ నిఘా కెమేరాల్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ కోచ్ సంతోష్, రోల్ బాల్ స్కేటింగ్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, విశాఖ జిల్లా కార్యదర్శి తోట లలిత ప్రియ, క్రీడాకారులు పాల్గొన్నారు.

'విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడతాం'

మురళీనగర్, అక్టోబరు 3: మాధవధారలో మానవసేవే మాధవసేవ అసోసియేషన్ తరుపున సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. మురళీనగర్ శ్రీదేవి పార్కు వేదికగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డి.ప్రసాద్ రాజు వ్యవహరించగా, వ్యవస్థాపక అధ్యక్షునిగా ఎస్.భానుప్రకాష్, ప్రెసిడెంట్‌గా ఎస్.సీతారామకృష్ణలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.వి.ఎన్.ఎస్.ప్రసాద్, డి.వరప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శిగా వై.తిరుమూర్తి, కోశాధికారిగా కె.వి.వర్మ, సంయుక్త కోశాధికారిగా టి.వెంకటేష్ నియమితులయ్యారు. ఉపకార్యదర్శులుగా ముగ్గురు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ముగ్గురిని, 19 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

దసరాకు ఆర్టీసీ స్పెషల్స్

... 5వ పేజీ తరువాయి

సాధారణ చార్జీలే వసూలు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

10 శాతం రాయితీ

దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు రానుపోను టికెట్లను ఒకేసారి రిజర్వు చేయించుకుంటే వారికి మొత్తం చార్జీలో పది శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. ద్వారకా కాంప్లెక్సులోని రిజర్వేషన్ కౌంటర్, ఆథరైజ్డు టికెట్ బుకింగ్ ఏజెన్సీలు, ఏపీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చునని ప్రకటించారు.

నేటి నుంచి జాతీయ వైద్య విజ్ఞాన సదస్సు

మహారాణిపేట, అక్టోబరు 3: ఇన్‌ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ (ఐబిడి)పై 8వ జాతీయ సదస్సు విశాఖలో నిర్వహించనున్నట్లు ఆంధ్ర వైద్య కళాశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ తెలిపారు. గురువారం కేజీహెచ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలియజేస్తూ ఈ నెల 4, 5, 6 తేదీల్లో విశాఖలోని హోటల్ నోవాటెల్‌లో వైజాగ్ గట్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ జి నాగేశ్వరరెడ్డి హాజరవుతారని తెలిపారు. సుమారు 700 మంది వైద్యనిపుణులు హాజరై వ్యాధి చికిత్సపై ఆధునిక సాంకేతిక విధానాలు వివరిస్తారన్నారు. సమావేశంలో డాక్టర్ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ సమావేశం రేపు

మురళీనగర్, అక్టోబరు 3; ఈ నెల 5న మురళీనగర్ వాకర్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు పల్లా. చంద్రమౌళి తెలిపారు. ఈ నెలలో చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

లేపాక్షి జంక్షనా.. వామ్మో!

జగదాంబ కూడలి, అక్టోబరు 3: జగదాంబ వద్ద లేపాక్షి జంక్షన్ పోలీస్ సర్కిల్ ఎప్పుడు పునరుద్ధరిస్తారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కేజీహెచ్ డౌన్, జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వైపు వెళ్లే మెయిన్ రోడ్డులో ప్రధాన కూడలి లేపాక్షి వద్ద రోడ్డు విస్తరణలో తొలగించిన పోలీస్ సర్కిల్ పునర్నిర్మాణానికి జీవీఎంసీ స్మార్ట్ సిటీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం, మూడు వైపుల నుంచి వాహనాలు, ఆర్టీసీ బస్సులు దూసుకురావడం, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు లేకపోవడంతో భయపడుతున్నారు. పోలీస్ బీట్ ఉంటే ఇబ్బందులు ఉండేవి కావన్నారు. ఈ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారు. జగదాంబ కూడలిలో ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, వస్త్రవ్యాపారాలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, పర్యాటక సందడితో అనుక్షణం కోలాహలంగా కనిపిస్తుంది. ఇక్కడ రోడ్డు విస్తరణ నేపథ్యంలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేపట్టకపోవడం జీవీఎంసీ స్మార్ట్ సిటీ అధికారుల నిర్లక్షానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణకు గురికావడంతో జనం రోడ్డు మధ్య నడవాల్సి వస్తోంది. లక్ష్మీమాల్ వద్ద పోలీసు బందోబస్తున్నా ఫుట్‌పాత్ వ్యాపారాలు జోరుగా సాగడం గమనార్హం. లేపాక్షి సర్కిల్ నిర్మాణంచేపట్టాలనిగత కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. ఆయన బదిలీ తర్వాత పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



లేపాక్షి జంక్షన్ వద్ద కనిపించని పోలీసు సర్కిల్

మద్యం దుకాణాలకు మహిళల పోటీ

- సెంటిమెంట్‌గా భార్య, కుమార్తెల పేరుతో దరఖాస్తులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్న వ్యాపారులు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు మహిళలు పోటీపడుతున్నారు. కొంతమంది వ్యాపారులు, ఆశావహులు సెంటిమెంట్‌గా తమ భార్య, కుమార్తెల పేరుతో దరఖాస్తు చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో 155 మద్యం దుకాణాలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్నవారితోపాటు కొత్తగా ఈ వ్యాపారంలోకి దిగాలనుకునేవారు సైతం ఎక్కడెక్కడ దుకాణాలకు దరఖాస్తు చేయాలా అనే దానిపై కసరత్తు ప్రారంభించారు. దరఖాస్తు చేసేందుకు ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిల్లాలో మూడు రోజుల్లో 300 వరకూ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి అందగా వీటిలో సగం మహిళల పేరుతోనే ఉన్నట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దరఖాస్తు ఫీజు కింద రూ.రెండు లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దుకాణం వచ్చినా, రాకపోయినా ఆ మొత్తాన్ని వెనక్కి ఇవ్వరని ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే మహిళలను కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిప్పాల్సి ఉంటుంది. అందువల్ల ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేస్తున్నారు. ధరావత్తు కూడా ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా ప్రభుత్వం సూచించిన ఖాతాకు బదిలీచేస్తున్నారు. ఇంతవరకూ ఆఫ్‌లైన్‌లో ఒక్క దరఖాస్తు కూడా తమకు అందలేదని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు అన్నారు. దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 9 వరకూ గడువు ఉన్నందున మహిళల పేరుతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఠారెత్తిస్తున్న టమాటా

... 5వ పేజీ తరువాయి

సమాచారం అందడంతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మార్కెటింగ్, రైతుబజార్ల అధికారులతో గురువారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఉల్లి, టమాటా ధరల పెరుగుదలకు కారణాలు తెలుసుకున్నారు. వినియోగదారులకు అందుబాటు ధరల్లో అన్నీ లభించేలా చూడాలని సూచించారు. ప్రభుత్వమే మదనపల్లెలో టమాటా కొని సరఫరా చేస్తున్నదని, లాభం/నష్టం లేని విధంగా అక్కడ కొన్న ధరకే రైతుబజార్లలో విక్రయించాలని సూచించిందని మార్కెటింగ్ శాఖాధికారులు తెలియజేశారు. మదనపల్లెలో గురువారం టమాటా రూ.79కి కొనుగోలు చేశారని, శుక్రవారం అదే రేటుతో అమ్మడానికి ఏర్పాట్లు చేస్తామని మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్ తెలిపారు. రేటు పెరిగినా సరకు దొరకడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నాణ్యతతో కూడిన సరకు, అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని జేసీ ఆదేశించారు.

ఎక్సైజ్‌లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కీలక ప్రజా ప్రతినిధిని ప్రసన్నం చేసుకున్నారు. దీంతో సదరు అధికారి డిప్యుటేషన్ రద్దు కావడంతోపాటు నగరంలో కీలకమైన పోస్టు లభించింది. ఆ పోస్టులో చేరిన తర్వాత సదరు అధికారి ఎక్సైజ్ శాఖలో తన ఇష్టమొచ్చినట్టు వ్యవహరించడం మొదలుపెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా నగరంలో పోస్టింగ్ పొందిన కిందిస్థాయి అధికారుల్లో కొందరిని విధుల్లో చేరకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. రిపోర్టు చేసేందుకు వచ్చిన వారి నుంచి రిపోర్టు తీసుకోకుండా టపాల్స్‌లో పెండింగ్‌లో ఉంచేశారని, జిల్లాలో పోస్టింగ్‌లు పొందిన కొంతమంది సీఐలు, ఎస్ఐలను వేరొకచోటకు పంపించేసి, తనకు అనుకూలంగా ఉన్నవారిని ఆయా పోస్టుల్లోకి తెచ్చుకోవాలని సదరు అధికారి యత్నిస్తున్నారని అంటున్నారు. అందుకోసం తనకు అండగా నిలుస్తున్న కూటమికి చెందిన ప్రజా ప్రతినిధి పలుకుబడిని ఉపయోగించుకోవాలని సదరు అధికారి భావిస్తున్నట్టు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సదరు అధికారి ఉద్దేశాన్ని కూటమి ప్రజా ప్రతినిధి గుర్తించాలని, అలాకాకుండా ఆయన చెప్పినట్టు చేస్తే మాత్రం ప్రభుత్వానికి చెడ్డపేరు రావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైసీపీ హయాంలో చక్రం తిప్పిన వారికి, వైసీపీ నేతలతో అంటకాగిన వారికి కూటమి ప్రజా ప్రతినిధులు అండగా నిలవడం, కీలకమైన పోస్టులు ఇప్పించడం దారుణమని ఎక్సైజ్ శాఖలోని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

గ్యాస్ కనెక్షన్లపై ఆరా

... 5వ పేజీ తరువాయి

సిలెండరు అందరి మాదిరిగానే రూ.811కు అందజేస్తున్నారు. కాగా కేంద్రం ఐదేళ్ల క్రితం 'ఉజ్వల' పథకం కింద జిల్లాలో 15,320 మందికి గ్యాస్ కనెక్షన్లు అందజేసింది. వీరికి మాత్రం సిలెండరు రూ.511కు సరఫరా చేస్తున్నారు. ప్రతి సిలెండరుపై కేంద్రం రూ.300 వంతున ఏడాదికి 12 సిలెండర్లకు సబ్సిడీ అందిస్తోంది. మహాశక్తి పథకం కింద ప్రతి మహిళకు ఏడాదికి మూడు సిలెండర్లు ఉచితంగా అందజేస్తామని కూటమి నాయకులు ప్రకటించారు. ప్రస్తుతం సిలెండర్ ధర రూ. 811. మూడు సిలెండర్లు ఖరీదు రూ.2,433. అయితే ఇందుకు ప్రామాణికాలు ఏంటి అనేది ఇంకా విధి విధానాలు ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు మాత్రమే సేకరించారు. అందరికీ ఇస్తారా?, లేక బియ్యం కార్డు కలిగి ఉన్నవారికే అమలు చేస్తారా?...అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఒకవేళ ప్రతి కార్డుదారుడికి ఉచితంగా మూడు సిలెండర్లు అందజేస్తే జిల్లాకు ఏడాదికి రూ.130 కోట్లు వరకూ ఖర్చవుతుందనేది ఒక అంచనా. పౌర సరఫరాల శాఖ వద్ద బియ్యం కార్డుదారుల వివరాలున్నాయి. గ్యాస్ కంపెనీల వద్ద కనెక్షన్‌దారుని వివరాలున్నా వారిలో ఎంతమందికి బియ్యం కార్డుందనే సమాచారం లేదు. త్వరలో గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాలశాఖ ఉన్న కనెక్షన్లు, కార్డుల వివరాలు సింకరనైజేషన్ చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీలు ఆధార్‌కార్డుతో ఈకేవైసీ చేస్తున్నారు.

పర్యాటక అక్రమాలపై విచారణ

... 5వ పేజీ తరువాయి

అవకతవకలపై విచారణకు అదే శాఖ మంత్రి వద్ద పనిచేసిన అధికారిని ఎలా పంపుతారని విమర్శలు రావడంతో ఆ కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని వేశారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి కంటే స్థాయి పెద్దదైన అధికారిని విచారణాధికారిగా వేయాలి. కానీ ఈ కొత్త కమిటీలో సమాన స్థాయి కలిగిన అధికారిని నియమించారు. దీనిని ఆ శాఖలో అధికారులే తప్పుబడుతున్నారు. పైగా అదే సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిని విచారణకు పంపడం వల్ల లోపాలు బయటపడవని, ఒకరికి మరొకరు సహకరించుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. వేరే శాఖకు చెందిన ఉన్నతాధికారులను విచారణకు పంపితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పైగా విచారణకు వచ్చిన అధికారులకు ఎంవీపీ కాలనీ ఉషోదయా జంక్షన్‌లో గల ఒక హోటల్‌లో వసతి సౌకర్యాలను ఇక్కడి అధికారులే కల్పించారని ఆరోపణలు వస్తున్నాయి. ఇలాగైతే విచారణ సక్రమంగా జరగదని అంటున్నారు. ప్రభుత్వం విశాఖలో పర్యాటక శాఖలో అక్రమాలను సీరియస్‌గా తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కమిటీ రెండో రోజు శుక్రవారం కూడా పలు ప్రాజెక్టులను సందర్శించి విచారణ నిర్వహించనుంది.

సభ్యత్వ నమోదులో అందరూ భాగస్వాములవ్వాలి

టీడీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీ

పెందుర్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. గురువారం ఇక్కడి తాండ్రపాపారాయుడు కల్యాణ మండలంలో జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయదశమి తర్వాత సభ్యత్వ నమోదుకు షెడ్యూల్ వస్తోందని, ప్రతి బూత్‌లో గతంలో కన్నా రెండింతలు మందికి సభ్యత్వం ఇవ్వాలని సూచించారు. ప్రతి పంచాయతీ, వార్డులో సర్పంచ్, కార్పొరేటరు, వార్డు/గ్రామ అధ్యక్షులు బాధ్యతలు తీసుకుని పనిచేయాలని గండి బాబ్జీ కోరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పరవాడ, సబ్బవరం మండల టీడీపీ అధ్యక్షులు వియపు చిన్న, మిడతాన మహాలక్ష్మి నాయుడు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి సూచనలిస్తున్న పోలీస్ అధికారి



డాక్‌యార్డు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న నేవీ సిబ్బంది

డాక్‌యార్డు వద్ద మోహరించిన పోలీసులు, నేవీ సిబ్బంది

ఉద్యోగులు మళ్లీ ఆందోళనకు దిగుతారేమోనని ముందస్తు చర్యలు

5వ తేదీ తర్వాత ఆందోళనను తీవ్రతరం చేసేందుకు ప్రణాళికలు!

మల్కాపురం, అక్టోబరు 3: డాక్‌యార్డు ఉద్యోగులు షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వంతెనపై నుంచి రాకపోకలు సాగించే విషయమై గురువారం మళ్లీ ఆందోళనకు దిగుతారేమోనన్న ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు, నేవీ సిబ్బందితో పాటు ప్రైవేటు సెక్యూరిటీ పెద్దఎత్తున మోహరించారు. డాక్‌యార్డు మార్గంలో ఇరుపక్కలా వారు పహారా కాశారు. అయితే ఉద్యోగులు ఎవరూ ఎలాంటి ఆందోళన చేపట్టకుండా విధులకు వెళ్లడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ నెల ఐదున డాక్‌యార్డు ఉద్యోగుల వర్క్స్ కమిటీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉద్యోగులు తమ ఆందోళనను వాయిదా వేసినట్టు తెలిసింది. ఈ నెల ఐదో తేదీ నాటికి నేవీ అధికారులు ఎస్‌బీసీ వంతెనపై నుంచి రాకపోకల విషయంలో ప్రకటన చేయకపోతే ఆందోళనను తీవ్రతరం చేయాలని ఉద్యోగులు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలియవచ్చింది.





సాగరగిరి కనకదుర్గమ్మ, అమ్మవారి దర్శనానికి బోటులో లాంచీలో వచ్చిన భక్తులు

సాగరగిరి కనకదుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

మల్కాపురం, అక్టోబరు 3: యారాడ కొండపై వెలసిన సాగరిగిరి కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము 4.45 గంటలకు అమ్మవారికి పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు అమ్మవారు బాలదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఏడు గంటలకు ప్రథమ పూజ, బాలభోగం, మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశాక పంచనేత్ర నక్షత్ర హారతినిచ్చారు. కాగా సాగరగిరి కనకదుర్గమ్మను దర్శించేందుకు నగరం నుంచి వచ్చే భక్తుల కోసం పోర్టు జెట్టీ నుంచి ప్రత్యేకంగా లాంచీని వేశారు. ఇందులో రెండు వైపులా రాకపోకలు సాగించేందుకు ఒక్కొక్కరికి రూ.40 వసూలు చేస్తున్నారు. దీంతో ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వందలాది మంది భక్తులు ఆలయ ఆవరణలో భవానీ మాలలను ధరించారు. మధ్యాహ్నం టీడీపీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ ఆధ్వర్యంలో అన్న సమారాధనను చేపట్టారు. అలాగే జనతా కాలనీలో జనతా కాలనీలో, గాజువాక ఆర్టీసీ డిపో వద్దనున్న ఉన్న విజయదుర్గాదేవి ఆలయంలో, మాజీ సైనికుల కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో, శ్రీహరిపురం బర్మా కాలనీలోని వనదుర్గాదేవి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

'ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

గాజువాక, అక్టోబరు 3: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. సమావేశంలో సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, మూర్తి, రౌతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

65వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ, అక్టోబరు 3: జీవీఎంసీ 65వ వార్డు భానోజీ తోటలో రూ.39 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, కాలువ నిర్మాణ పనులకు గురువారం అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటికి కదలిక వచ్చిందన్నారు.

'ఉక్కు' దీక్షా శిబిరం వద్ద పోలీసుల పహారా

కూర్మన్నపాలెం, అక్టోబరు 3: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికుల ఆందోళనలు ఉధృతమవుతున్న నేపథ్యంలో గురువారం కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం వద్ద పోలీసులు పహారా కాశారు. శిబిరంలో నాయకులు, కార్మికులు ఉన్నంతవరకు పోలీసులు అక్కడ ఉండేలా ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కాగా దీక్షా శిబిరం పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, యు.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 3: స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాలు చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ గాంధీ పార్కులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్లాంట్ జీఎం ఎస్.కుమారస్వామి మాట్లాడుతూ ఏటా బతుకమ్మ సంబరాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎస్.వీరేశం, జి.ఆనంద్, బి.వెంకటేశ్వర్లు, నరసింగరావు, ప్రభాకర్. రవికుమార్, భిక్షం, శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం రూ.1,08,471 అందజేత

గాజువాక, అక్టోబరు 3: వరద బాధితుల సహాయార్థం విశాఖ సొండికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.1,08,471కు సంబంధించిన చెక్కును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఇక్కడి టీడీపీ కార్యాలయంలో గురువారం సంఘం ప్రతినిధులు అందజేశారు. చెక్కును అందజేసిన వారిలో సంఘం ప్రతినిధులు బి.రవిచంద్ర, దేవరాజు, తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఈడీ కార్యాలయం వద్ద సీఐటీయూ ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 3: ఉక్కు కార్మిక వర్గంపై యాజమాన్యం దాడి చేస్తుందని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం అన్నారు. కార్మిక సంక్షేమంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం తూట్లు పొడుస్తుందని మండిపడ్డారు. కార్మికులకు న్యాయంగా రావాల్సిన హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్స్‌లను నిలిపివేసిందని, టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో ఉంటున్న వారి నుంచి అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులను వసూలు చేస్తుండడం దారుణమన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, వైటీ దాసు, బి.అప్పారావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



70వ వార్డు డ్రైవర్స్ కాలనీలోని ఆలయంలో పూజలందుకున్న కనకదుర్గమ్మ



యారాడ దుర్గాదేవి ఆలయంలో గరికలతో అమ్మవారిని ముస్తాబు చేసిన దృశ్యం



ఎల్‌వీ నగర్‌లో బాలత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



వేపగుంటలో వెండి కవచధారణతో పూజలందుకున్న ముత్యమాంబ



అగనంపూడిలో బాలత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన దురమాంబ

దుర్గమ్మకు భక్త నీరాజనం

వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు

పెందుర్తి, అక్టోబరు 3: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం పలు ప్రాంతాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాతిచెరువు, దొగ్గవానిపాలెం, పాత ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా, పెందుర్తి కూడలిలోని దుర్గాదేవిని మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ప్రశాంతిగనర్‌లోని గల దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని రజిత రూపిణిగా అలంకరించగా, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు దర్శించుకుని పూజలు జరిపారు. చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీదేవిని రజితంతో, సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలో అమ్మవారిని ఆదిలక్ష్మిగా, వెంకటాద్రి శిఖరం దిగువన గల మహాకామేశ్వరి రజితతో, ఎస్ఆర్‌పురం కనకదుర్గ ఆలయంలోని అమ్మవారిని స్వర్ణకవచంతో అలంకరించి పూజలు నిర్వహించారు.

శారదా పీఠంలో..



రాజశ్యామల అమ్మవారికి హారతి ఇస్తున్న శారదా పీఠాధిపతి స్వరూపా నందేంద్ర సరస్వతి

అలాగే చినముషిడివాడలోని శారదా పీఠంలో పీఠాధిపతి స్వరూపా నందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర ఆధ్వర్యంలో అధిష్ఠాన దేవత శారదామాతకు నవ రాత్రి కలశ స్థాపన చేసి శరన్నవ రాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్వర్ణ మండపంలోని శారదా రాజశ్యామల అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి ఏకాదశ హారతులిచ్చారు. రుత్వికులు శ్రీచక్రార్చన, చండీయాగాలకు అంకురార్పణ చేశారు. తొలిరోజు శారదా రాజశ్యామల అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సాధూ మఠం సమీపంలోని మహాకామేశ్వరి పీఠంలోని అమ్మవారికి భమిడిపాటి శ్రీరామ్మూర్తి ప్రత్యేక పూజలు చేశారు. మహాకామేశ్వరీమాత సన్నిధిలో మహా యజ్ఞం, చండీయాగానికి అంకురార్పణ చేశారు. ఉత్తర పీఠాధిపతి శక్తిదేవి భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తూ దివంగత పీఠాధిపతి అయ్యన్నపంతులు ఆశీసులతో లోకకల్యాణం, విశ్వశాంతిని ఆకాంక్షిస్తూ పీఠంలో యజ్ఞ, యాగాదులను నిర్వహిస్తున్నామన్నారు.

పెందుర్తి-రూరల్: మండలంలోని పురుషోత్తపురంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత 'పెందుర్తి' అధ్యక్షుడు శ్రీను యాదవ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే లక్ష్మీపురం దుర్గానగర్ కాలనీ, చింతలఅగ్రహారం రామాలయం, సుజాతనగర్ బస్టాండ్, పినగాడి పెట్రోల్ బంక్, పినగాడి బీసీ కాలనీ ప్రాంతాల్లో దుర్గాదేవి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్ గుడి వీధిలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో



తుంగ్లాంలో పూజల్లో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు



గాజువాకలో దుర్గాదేవి సన్నిధిలో కరణంరెడ్డి నరసింగరావు



పెందుర్తిలో పూజల్లో పాల్గొన్న శరగడం చినఅప్పలనాయుడు



ప్రశాంతినగర్‌లో అమ్మవారిని దర్శించిన పీలా శ్రీనివాసరావు

అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, హోమం జరిపారు. రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేయగా, పలువురు భక్తులు సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణాన్ని పఠించారు. వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలోని అమ్మవాని వెండికవచంతో అలంకరించి పూజలు జరిపారు. అప్పన్నపాలెం వర్షిణి టవర్స్ జీ-బ్లాక్‌లో, వినోద్‌నగర్ లవ్‌లీ గయ్స్ ఆధ్వర్యంలో దుర్గామాతకు పూజలు చేశారు.

గోపాలపట్నం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తపాలెం గ్రామంలోని విజయ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపురసుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక కుంకుమ సుమారు ఐదు వందల మంది మహిళలు పాల్గొన్నారు. కాగా భవానీ భక్తులు ఉదయం పెద్దసంఖ్యలో మాలధారణలను చేపట్టారు.

గాజువాక: పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పలు చోట్ల భవానీ భక్తులు అమ్మవారి మాలధారణ చేశారు. పలుచోట్ల ప్రతిష్ఠించిన అమ్మవార్లను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు దర్శించుకుని పూజలు చేశారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలోని మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర సహిత శ్రీమహాలక్ష్మి, శ్రీమహాదుర్గా, శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు సహస్ర కుంకుమార్చన చేశారు. శ్రీమహాదుర్గను బాలత్రిపుర సుందరి (ఆకుపచ్చ వర్ణం)గా, శ్రీమహాలక్ష్మి అమ్మవారిని శ్రీఆదిలక్ష్మి (కాఫీ వర్ణం)గా, శ్రీమహాసరస్వతి అమ్మవారిని శ్రీభారతి దేవి (తెలుపు)గా అలంకరించి ప్రధాన అర్చకులు ఫణి శర్మ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను చేపట్టారు.

సింధియా: జీవీఎంసీ 40, 62, 63 వార్డుల్లో శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని దుర్గాదేవి ఆలయాల్లో, మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇందులో భాగంగా యారాడలోని దుర్గాదేవి ఆలయంలో పచ్చని గరికలతో అమ్మవారిని అలంకరించి పూజలు జరపగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. చింతలలోవ, క్రాంతినగర్, తదితర ప్రాంతాల్లోని దుర్గాదేవిని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్నా, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఆయా మండపాల్లో మాలధారణ చేసిన భవానీ భక్తులు అమ్మవారికి పూజలు చేసి భక్తిగీతాలను ఆలపించారు.

పెదగంట్యాడ: ఇక్కడి బాబూజగ్జీవన్‌రామ్ కాలనీలో గణేశ్ దుర్గా యూత్ ఆధ్వర్యంలో, బీసీ రోడ్డు ఆటో స్టాండ్ యూనియన్, సీతానగరం ఎన్టీఆర్ సెంటర్‌లో గ్రామ కమిటీ, ఆటోస్టాండ్ యూనియన్, బర్మా కాలనీ, నడుపూరు, ప్రియదర్శని కాలనీ, వికాస్‌నగర్, తదితర ప్రాంతాల్లో దుర్గాదేవిలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అమ్మవారి దర్శనార్థం ఆయా మండపాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఆటోనగర్: గ్రేటర్ 70వ వార్డు ఎల్‌వీనగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చందు, జెడ్సీ శేషాద్రి,శివ, కూటమి నాయకులు కెవిఎస్ శంకరరావు, పీబీఎల్ మూర్తి,గణేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగనంపూడి: ఇక్కడి పోస్టాఫీసు వద్ద గల దుర్గమాంబ ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బొర్రమాంబ పారాయణ సేవాసమితి ప్రతినిధులు లలిత,విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్ తెలిపారు. పాతఅగనంపూడిలో భవానీ భక్తులు ఊరేగింపుగా దుర్గాదేవి ప్రతిమను తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం కలశ పూజలు చేశారు. స్థానిక కూడలిలో శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. పెదమడక కొండపై కొలువుదీరిన శ్రీమాతా దుర్గాభవానీ ఆలయంలో కుంకుమ పూజల్లో ఆలయ ధర్మకర్త బల్ల పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: కాపు తుంగ్లాంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తొలి పూజ చేసి శరన్నవ రాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. నిర్వాహకులు అక్కిరెడ్డి శ్రీనివాస్, కె.ముత్యాలనాయుడు, కె.ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. నాతయ్యపాలెం, రెడ్డి తుంగ్లాం కాలనీల్లోని దుర్గాదేవిని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దర్శించుకుని పూజలు జరిపారు. అక్కిరెడ్డిపాలెం రామాలయం ఉత్సవాలను కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ ప్రారంభించగా నాయకుడు రాజేశ్, భవానీ భక్తులు పాల్గొన్నారు.



వీవీఎన్‌ఎం రాజా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు, తదితరులు

వీవీఎన్‌ఎం రాజా మృతి తీరని లోటు

సంస్మరణ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, అక్టోబరు 3: ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న తన బాల్య మిత్రుడు, గాజువాక మునిసిపాలిటీ మాజీ చైర్మన్ వీవీఎన్‌ఎం రాజా అకాలమృతి తనను ఎంతోగానో కలచివేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు. గురువారం శివాజీ నగర్‌లో వీవీఎన్‌ఎం రాజా సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పల్లా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మట్లాడుతూ ఎంతో మంచి మనిషి, ప్రజలకు కష్టమంటే ఆదుకునే స్వభావం గల మనసున్న మా రాజా లేని లోటు తీరనిదన్నారు. కూర్మన్నపాలెం ప్రాంత అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి రాజా ఎంతో కృషి చేశారన్నారు. తొలుత రాజా సోదరుడు సీతారామరాజు (బుజ్జి), కుటుంబ సభ్యులను పల్లా పరామర్శించారు. ఎమ్మెల్యేలు పి.గణబాబు, కొణతాల రామకృష్ణలు రాజాతో ఉన్నకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజలకు మేలు చేసేందుకు ఎప్పుడూ రాజా ముందుండే వారన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు రాజాకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, వుడా మాజీ చైర్మన్ రవి, మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, కార్పొరేటర్లు బొండా జగన్, ఉరుకూటి చందు, ఇమ్రాన్, సురేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డి, కేవీ సుబ్బరాజు, నాయకులు కొయ్య ప్రసాద రెడ్డి, దామా సుబ్బారావు, బి.సతీశ్‌వర్మ, కేకే రాజు, భూపతిరాజు శ్రీనివాసరాజు, దేవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శ్యాగ్:** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **దక్షిణ:** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **రామ్‌నగర్ బన్నీ:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **దేవర:** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం:** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 66, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 22, క్యారెట్ 48 దొండకాయలు 48, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 85, మునక్కాడలు (కిలో) 90, బరబటి 50, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 85, పొటల్స్ 36, కీరదోస 28, క్యాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 66, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	108
ఫారం ధర	--	128
విత్ స్కిన్	--	226
స్కిన్‌లెస్	--	236

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIలో..


మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో సీతంపేట పార్వతీదేవి


బాలా త్రిపుర సుందరిగా డాబాగార్డెన్స్ ఉమాదేవి అమ్మవారు


మధుసూదన్ నగర్‌లో కొలువైన అమ్మవారు


సీతంపేటలో రాములోరు అవతారంలో వెంకటేశ్వరస్వామి

అంతటా 'అమ్మ' స్మరణ

▸ వాడవాడలా భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన శరన్నవరాత్రి మహోత్సవాలు

జగదాంబ కూడలి, అక్టోబరు 3: భక్తులు 'అమ్మ'గా, కొంగుబంగారంగా, ఆదిపరాశక్తిగా ఆరాధించే దుర్గాదేవి (శరన్నవరాత్రులు) ఉత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో కొలువైన అమ్మవార్లను వివిధ రూపాల్లో కొలువుదీర్చారు. వన్‌టౌన్ కనకమహాలక్ష్మిని ఆదిలక్ష్మి రూపంలో భక్తులు దర్శించుకున్నారు. బురుజుపేటలోని కనక మహాలక్ష్మి అమ్మవారి లక్ష కుంకుమార్చన పూజల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈవో కె.శోభారాణి, జేఈవో తిరుమలేశ్వరరావు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు ఆహ్వానం పలికారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ అర్చకులు భక్తితో అమ్మవారికి కుంకుమ పూజ జరిపించారు. ఆదిలక్ష్మి రూపంలో అమ్మవారిని చూసి భక్తులు తన్మయంతో మోకరిల్లారు.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవికి అర్చకులు జి.భార్గవశర్మ సంప్రదాయ రీతిలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో జీవీ రమాబాయి, ఎం.మన్మథరెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

అక్కయ్యపాలెం: మధుసూదన్‌నగర్‌లోని స్వాగతద్వారం నుంచి కలశంతో ఊరేగింపుగా లక్ష్మీగణపతి సహిత కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని కలశ ప్రతిష్ఠ చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శీరంశెట్టి శంకర్, లక్ష్మి దంపతులచే ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, చదువుల పరమానందరావులు కలశపూజ చేయించారు. శుక్రవారం అమ్మవారిని ఊరేగించి, భక్తుల స్వహస్తాలతో పాలు, జలాభిషేకం చేయనున్నారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయి. 9న సామూహిక అక్షరాభిషేకం, దుర్గాష్టమి నాడు ఉదయం నుంచి హోమం జరుగుతుంది. రోజూ సాయంత్రం అమ్మవారికి లలితా సహస్రనామం, అమ్మవారి ఖడ్గమాల జరుగుతుంది. మధుసూదన్‌నగర్ గ్రామాధ్యక్షుడు కలిమిరెడ్డి అప్పారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు వానపల్లి వెంకటరావు, గురి ఈశ్వరరావు, తెడ్డు అప్పారావు, గొండేశి కనకరెడ్డి, ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని గంగన్ననగర్, రెడ్డి కంచరపాలెం, కొత్తవాడ వీధి, గొల్ల కంచరపాలెం, రవీంద్ర నగర్, ఐటీఐ జంక్షన్‌లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. తొలి రోజు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

సీతంపేట: సీతంపేటలోని పార్వతీశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం చేయించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహిళలతో సామూహిక కుంకుమార్చన, చండీ హోమం చేయించారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ అర్చక బృందం పూజల్లో పాల్గొంది.

సీతమ్మధార: సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల షిరిడి సాయిబాబా, వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా, వెంకటేశ్వరస్వామిని రాములోరుగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని బాలత్రిపుర సుందరి అవతారంలో భక్తులు పల్లకిపై సీతమ్మధార కృష్ణమందిరం ప్రాంతంలో ఊరేగించినట్లు ఈఓ బండారు ప్రసాద్ తెలిపారు. పూజ కార్యక్రమంలో బిజెపి నాయకురాలు శ్యామలదీపిక పాల్గొని అన్నదాన కార్యక్రమంలో భక్తులకు వడ్డించారు.

ఐటీఐ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కమిటీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్, తదితరులు

కంచరపాలెం, అక్టోబరు 3: ప్రభుత్వ ఐటీఐల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంఘ కార్యవర్గ ఎన్నిక గురువారం కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో జరిగింది. సంఘ నాయకులు కె.శ్రీనివాసరావు, బి.రవికుమార్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పి.బాలాజీ (ట్రైనింగ్ ఆఫీసర్), ఉపాధ్యక్షుడిగా కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఎ.జయలక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా బి.సత్యనారాయణ, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా ఐవీ కుమార్, లక్ష్మణరావులు ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ ఉమాశంకర్ అభినందించారు.

రోజుకు 90 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయండి

మహారాణిపేట, అక్టోబరు 3: ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో రోజుకు 90 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇళ్ల నిర్మాణం, ఇతర అంశాలపై సమీక్షించారు. లే అవుట్‌ల వారీగా చేపట్టవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకోవాలని తెలిపారు.

మహిళల్లో రక్తహీనతను గుర్తించాలి

మహారాణిపేట, అక్టోబరు 3: మహిళల ఆరోగ్యంపై రక్తహీనత ఎక్కువగా ప్రభావితం చేస్తుందని, అందువల్ల దీన్ని గుర్తించటం చాలా ప్రధానమని ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రెట్రిక్ ప్రెసిడెంట్ డాక్టర్ జయదీప్ ట్యాంక్ అన్నారు. గురువారం హెల్త్‌కేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహారాణిపేటలోని వైద్యుల సమావేశమందిరంలో ఆయన మాట్లాడారు. దేశంలో 50 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, ఎక్కువ కాలం చికిత్స అందించకపోతే వారి ఆరోగ్యం, శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్చరించారు. పౌష్టికాహార లోపం దీనికి ప్రధాన కారణమని తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రచారం చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో డైరెక్టర్ మిలింద్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మానసిక రోగి

అక్కయ్యపాలెం, అక్టోబరు 3: ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న బిశ్వజిత్ (50)ను పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బంకుర జిల్లాలోని మదన్ మోహన్‌పూర్ గ్రామంలోని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అతని మానసిక పరిస్థితి బాగులేకపోవడంతో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించడంతో కోలుకున్నాడని, దీంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. ఆయన సోదరుడు బాంగీస బదన్ కుటుంబ సభ్యులతో రావడంతో వారికి బిశ్వజిత్‌ను అప్పగించినట్లు చెప్పారు.

చెత్తపన్ను రద్దుపై వార్వా, నివాస్ హర్షం

అక్కయ్యపాలెం: చెత్త పన్ను రద్దు నిర్ణయంపై విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా), గ్రేటర్ విశాఖ రెసిడెంట్ కాలనీ అసోసియేషన్ ఫెడరేషన్ (నివాస్) ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. 2021లో ప్రతి ఇంటికి నెలకు రూ.120 వంతున చెత్త సేకరణ చార్జీలు గత ప్రభుత్వం విధించిందని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వం దీన్ని రద్దు చేయడం ఆనందంగా ఉందన్నారు.

కంచరపాలెం: చెత్త పన్నును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై ఇంటక్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విధించిన చెత్తపన్నుపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది .కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పన్నును రద్దు చేస్తూ జీవోను విడుదల చేయడంతో ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరపు రెడ్డి కొండబాబు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో చిన్న వర్తకులు, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

మిజోరం గవర్నర్ హరిబాబుకు నాగార్జున పరామర్శ

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మిజోరం గవర్నర్, విశాఖపట్నం మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబును గురువారం సినీ నటుడు అక్కినేని నాగార్జున పరామర్శించారు. హరిబాబు ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విశాఖలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సినిమా షూటింగ్ నిమిత్తం విశాఖలో ఉన్న నాగార్జున మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తో కలిసి హరిబాబు నివాసానికి వెళ్లి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పార్కులో భద్రతకు ప్రాధాన్యం: సీఐ

మాధవధార, అక్టోబరు 3: వైశాఖీ స్పోర్ట్స్ పార్కు వేదికగా బుధ, గురువారాల్లో నిర్వహించిన మహాత్మాగాంధీ మెమోరియల్ రోల్ బాల్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. టోర్నమెంట్ విజేతలకు కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ బహుమతులు అందించి క్రీడాకారులను, నిర్వాహకులను అభినందించారు. క్రీడలు, వ్యాయామం, ఆహ్లాదానికి నెలవైన పార్కులో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం పార్కు పరిసరాల్ని పరిశీలించిన సీఐ గతంలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించారు. అల్లరి మూకలు పార్కులో ఇబ్బంది పెట్టిన ఘటనలపై కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌ని అడిగి తెలుసుకున్నారు. పార్కులో సీసీ నిఘా కెమేరాల్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ కోచ్ సంతోష్, రోల్ బాల్ స్కేటింగ్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, విశాఖ జిల్లా కార్యదర్శి తోట లలిత ప్రియ, క్రీడాకారులు పాల్గొన్నారు.

'విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడతాం'

మురళీనగర్, అక్టోబరు 3: మాధవధారలో మానవసేవే మాధవసేవ అసోసియేషన్ తరుపున సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. మురళీనగర్ శ్రీదేవి పార్కు వేదికగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డి.ప్రసాద్ రాజు వ్యవహరించగా, వ్యవస్థాపక అధ్యక్షునిగా ఎస్.భానుప్రకాష్, ప్రెసిడెంట్‌గా ఎస్.సీతారామకృష్ణలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.వి.ఎన్.ఎస్.ప్రసాద్, డి.వరప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శిగా వై.తిరుమూర్తి, కోశాధికారిగా కె.వి.వర్మ, సంయుక్త కోశాధికారిగా టి.వెంకటేష్ నియమితులయ్యారు. ఉపకార్యదర్శులుగా ముగ్గురు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ముగ్గురిని, 19 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

దసరాకు ఆర్టీసీ స్పెషల్స్

... 5వ పేజీ తరువాయి

సాధారణ చార్జీలే వసూలు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

10 శాతం రాయితీ

దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు రానుపోను టికెట్లను ఒకేసారి రిజర్వు చేయించుకుంటే వారికి మొత్తం చార్జీలో పది శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. ద్వారకా కాంప్లెక్సులోని రిజర్వేషన్ కౌంటర్, ఆథరైజ్డు టికెట్ బుకింగ్ ఏజెన్సీలు, ఏపీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చునని ప్రకటించారు.

నేటి నుంచి జాతీయ వైద్య విజ్ఞాన సదస్సు

మహారాణిపేట, అక్టోబరు 3: ఇన్‌ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ (ఐబిడి)పై 8వ జాతీయ సదస్సు విశాఖలో నిర్వహించనున్నట్టు ఆంధ్ర వైద్య కళాశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ తెలిపారు. గురువారం కేజీహెచ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలియజేస్తూ ఈ నెల 4, 5, 6 తేదీల్లో విశాఖలోని హోటల్ నోవాటెల్‌లో వైజాగ్ గట్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ జి నాగేశ్వరరెడ్డి హాజరవుతారని తెలిపారు. సుమారు 700 మంది వైద్యనిపుణులు హాజరై వ్యాధి చికిత్సపై ఆధునిక సాంకేతిక విధానాలు వివరిస్తారన్నారు. సమావేశంలో డాక్టర్ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ సమావేశం రేపు

మురళీనగర్, అక్టోబరు 3; ఈ నెల 5న మురళీనగర్ వాకర్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు పల్లా. చంద్రమౌళి తెలిపారు. ఈ నెలలో చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

లేపాక్షి జంక్షనా.. వామ్మో!

జగదాంబ కూడలి, అక్టోబరు 3: జగదాంబ వద్ద లేపాక్షి జంక్షన్ పోలీస్ సర్కిల్ ఎప్పుడు పునరుద్ధరిస్తారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కేజీహెచ్ డౌన్, జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వైపు వెళ్లే మెయిన్ రోడ్డులో ప్రధాన కూడలి లేపాక్షి వద్ద రోడ్డు విస్తరణలో తొలగించిన పోలీస్ సర్కిల్ పునర్నిర్మాణానికి జీవీఎంసీ స్మార్ట్ సిటీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం, మూడు వైపుల నుంచి వాహనాలు, ఆర్టీసీ బస్సులు దూసుకురావడం, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు లేకపోవడంతో భయపడుతున్నారు. పోలీస్ బీట్ ఉంటే ఇబ్బందులు ఉండేవి కావన్నారు. ఈ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారు. జగదాంబ కూడలిలో ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, వస్త్రవ్యాపారాలు, షాపింగ్ మాల్స్ సినిమా థియేటర్లు, పర్యాటక సందడితో అనుక్షణం కోలాహలంగా కనిపిస్తుంది. ఇక్కడ రోడ్డు విస్తరణ నేపథ్యంలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేపట్టకపోవడం జీవీఎంసీ స్మార్ట్ సిటీ అధికారుల నిర్లక్షానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణకు గురికావడంతో జనం రోడ్డు మధ్య నడవాల్సి వస్తోంది. లక్ష్మీమాల్ వద్ద పోలీసు బందోబస్తున్నా ఫుట్‌పాత్ వ్యాపారాలు జోరుగా సాగడం గమనార్హం. లేపాక్షి సర్కిల్ నిర్మాణంచేపట్టాలనిగత కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. ఆయన బదిలీ తర్వాత పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.


లేపాక్షి జంక్షన్ వద్ద కనిపించని పోలీసు సర్కిల్

మద్యం దుకాణాలకు మహిళల పోటీ

▸ సెంటిమెంట్‌గా భార్య, కుమార్తెల పేరుతో దరఖాస్తులు

▸ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్న వ్యాపారులు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు మహిళలు పోటీపడుతున్నారు. కొంతమంది వ్యాపారులు, ఆశావహులు సెంటిమెంట్‌గా తమ భార్య, కుమార్తెల పేరుతో దరఖాస్తు చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో 155 మద్యం దుకాణాలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్నవారితోపాటు కొత్తగా ఈ వ్యాపారంలోకి దిగాలనుకునేవారు సైతం ఎక్కడెక్కడ దుకాణాలకు దరఖాస్తు చేయాలా అనే దానిపై కసరత్తు ప్రారంభించారు. దరఖాస్తు చేసేందుకు ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిల్లాలో మూడు రోజుల్లో 300 వరకూ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి అందగా వీటిలో సగం మహిళల పేరుతోనే ఉన్నట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దరఖాస్తు ఫీజు కింద రూ.రెండు లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దుకాణం వచ్చినా, రాకపోయినా ఆ మొత్తాన్ని వెనక్కి ఇవ్వరని ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే మహిళలను కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిప్పాల్సి ఉంటుంది. అందువల్ల ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేస్తున్నారు. ధరావత్తు కూడా ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా ప్రభుత్వం సూచించిన ఖాతాకు బదిలీచేస్తున్నారు. ఇంతవరకూ ఆఫ్‌లైన్‌లో ఒక్క దరఖాస్తు కూడా తమకు అందలేదని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు అన్నారు. దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 9 వరకూ గడువు ఉన్నందున మహిళల పేరుతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

రారెత్తిస్తున్న టమాటా

... 5వ పేజీ తరువాయి

సమాచారం అందడంతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మార్కెటింగ్, రైతుబజార్ల అధికారులతో గురువారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఉల్లి, టమాటా ధరల పెరుగుదలకు కారణాలు తెలుసుకున్నారు. వినియోగదారులకు అందుబాటు ధరల్లో అన్నీ లభించేలా చూడాలని సూచించారు. ప్రభుత్వమే మదనపల్లెలో టమాటా కొని సరఫరా చేస్తున్నదని, లాభం/నష్టం లేని విధంగా అక్కడ కొన్న ధరకే రైతుబజార్లలో విక్రయించాలని సూచించిందని మార్కెటింగ్ శాఖాధికారులు తెలియజేశారు. మదనపల్లెలో గురువారం టమాటా రూ.79కి కొనుగోలు చేశారని, శుక్రవారం అదే రేటుతో అమ్మడానికి ఏర్పాట్లు చేస్తామని మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్ తెలిపారు. రేటు పెరిగినా సరకు దొరకడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నాణ్యతతో కూడిన సరకు, అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని జేసీ ఆదేశించారు.

ఎక్సైజ్‌లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కీలక ప్రజా ప్రతినిధిని ప్రసన్నం చేసుకున్నారు. దీంతో సదరు అధికారి డిప్యూటేషన్ రద్దు కావడంతోపాటు నగరంలో కీలకమైన పోస్టు లభించింది. ఆ పోస్టులో చేరిన తర్వాత సదరు అధికారి ఎక్సైజ్ శాఖలో తన ఇష్టమొచ్చినట్టు వ్యవహరించడం మొదలుపెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా నగరంలో పోస్టింగ్ పొందిన కిందిస్థాయి అధికారుల్లో కొందరిని విధుల్లో చేరకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. రిపోర్టు చేసేందుకు వచ్చిన వారి నుంచి రిపోర్టు తీసుకోకుండా టపాల్స్‌లో పెండింగ్‌లో ఉంచేశారని, జిల్లాలో పోస్టింగ్‌లు పొందిన కొంతమంది సీఐలు, ఎస్ఐలను వేరొకచోటకు పంపించేసి, తనకు అనుకూలంగా ఉన్నవారిని ఆయా పోస్టుల్లోకి తెచ్చుకోవాలని సదరు అధికారి యత్నిస్తున్నారని అంటున్నారు. అందుకోసం తనకు అండగా నిలుస్తున్న కూటమికి చెందిన ప్రజా ప్రతినిధి పలుకుబడిని ఉపయోగించుకోవాలని సదరు అధికారి భావిస్తున్నట్టు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సదరు అధికారి ఉద్దేశాన్ని కూటమి ప్రజా ప్రతినిధి గుర్తించాలని, అలాకాకుండా ఆయన చెప్పినట్టు చేస్తే మాత్రం ప్రభుత్వానికి చెడ్డపేరు రావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైసీపీ హయాంలో చక్రం తిప్పిన వారికి, వైసీపీ నేతలతో అంటకాగిన వారికి కూటమి ప్రజా ప్రతినిధులు అండగా నిలవడం, కీలకమైన పోస్టులు ఇప్పించడం దారుణమని ఎక్సైజ్ శాఖలోని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

గ్యాస్ కనెక్షన్లపై ఆరా

... 5వ పేజీ తరువాయి

సిలెండరు అందరి మాదిరిగానే రూ.811కు అందజేస్తున్నారు. కాగా కేంద్రం ఐదేళ్ల క్రితం 'ఉజ్వల' పథకం కింద జిల్లాలో 15,320 మందికి గ్యాస్ కనెక్షన్లు అందజేసింది. వీరికి మాత్రం సిలెండరు రూ.511కు సరఫరా చేస్తున్నారు. ప్రతి సిలెండరుపై కేంద్రం రూ.300 వంతున ఏడాదికి 12 సిలెండర్లకు సబ్సిడీ అందిస్తోంది. మహాశక్తి పథకం కింద ప్రతి మహిళకు ఏడాదికి మూడు సిలెండర్లు ఉచితంగా అందజేస్తామని కూటమి నాయకలు ప్రకటించారు. ప్రస్తుతం సిలెండర్ ధర రూ. 811. మూడు సిలెండర్ల ఖరీదు రూ.2,433. అయితే ఇందుకు ప్రామాణికాలు ఏంటి అనేది ఇంకా విధి విధానాలు ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు మాత్రమే సేకరించారు. అందరికీ ఇస్తారా?, లేక బియ్యం కార్డు కలిగి ఉన్నవారికే అమలు చేస్తారా?..అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఒకవేళ ప్రతి కార్డుదారుడికి ఉచితంగా మూడు సిలెండర్లు అందజేస్తే జిల్లాకు ఏడాదికి రూ.130 కోట్లు వరకూ ఖర్చవుతుందనేది ఒక అంచనా. పౌర సరఫరాల శాఖ వద్ద బియ్యం కార్డుదారుల వివరాలున్నాయి. గ్యాస్ కంపెనీల వద్ద కనెక్షన్‌దారుని వివరాలున్నా వారిలో ఎంతమందికి బియ్యం కార్డుందనే సమాచారం లేదు. త్వరలో గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాలశాఖ ఉన్న కనెక్షన్లు, కార్డుల వివరాలు సింకరనైజేషన్ చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీలు ఆధార్‌కార్డుతో ఈకేవైసీ చేస్తున్నారు.

పర్యాటక అక్రమాలపై విచారణ

... 5వ పేజీ తరువాయి

అవకతవకలపై విచారణకు అదే శాఖ మంత్రి వద్ద పనిచేసిన అధికారిని ఎలా పంపుతారని విమర్శలు రావడంతో ఆ కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని వేశారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి కంటే స్థాయి పెద్దదైన అధికారిని విచారణాధికారిగా వేయాలి. కానీ ఈ కొత్త కమిటీలో సమాన స్థాయి కలిగిన అధికారిని నియమించారు. దీనిని ఆ శాఖలో అధికారులే తప్పుబడుతున్నారు. పైగా అదే సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిని విచారణకు పంపడం వల్ల లోపాలు బయటపడవని, ఒకరికి మరొకరు సహకరించుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. వేరే శాఖకు చెందిన ఉన్నతాధికారులను విచారణకు పంపితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పైగా విచారణకు వచ్చిన అధికారులకు ఎంవీపీ కాలనీ ఉషోదయా జంక్షన్‌లో గల ఒక హోటల్‌లో వసతి సౌకర్యాలను ఇక్కడి అధికారులే కల్పించారని ఆరోపణలు వస్తున్నాయి. ఇలాగైతే విచారణ సక్రమంగా జరగదని అంటున్నారు. ప్రభుత్వం విశాఖలో పర్యాటక శాఖలో అక్రమాలను సీరియస్‌గా తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కమిటీ రెండో రోజు శుక్రవారం కూడా పలు ప్రాజెక్టులను సందర్శించి విచారణ నిర్వహించనుంది.

వెటర్నరీ వైద్యుడి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, అక్టోబరు 3 : జూపార్కులో వెటర్నరీ వైద్యుడు పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ఆసక్తి గల వారు ఈనెల 8వ తేదీలోగా పోస్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, రూ. 50 వేలు వరకు వేతనం ఉంటుందని చెప్పారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, అక్టోబరు 3 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజ చేశారు. మంత్రపుష్పం, నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తరువాత అదేవేదికపై ఆగమశాస్త్ర విధానంలో స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమునిపట్నం, అక్టోబరు 3 : పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరగనున్నట్టు పట్టణ వైఎంసీఏ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, ఆల్బర్ట్ సుదర్శన్ తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభిస్తారని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకూ కొనసాగుతుందన్నారు. శిబిరంలో అన్ని రోగాలకు పరీక్షలు చేసి, మందులు అందిస్తామన్నారు. ఈకార్యక్రమాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొమ్మాది, అక్టోబరు 3 : కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మారికవలస,11 కేవీ జేకే లేఅవుట్ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ నరేశ్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మారికవలస జంక్షన్, మారికవలస, బోరవానిపాలెం, జేఎన్ఆర్ఎం కాలనీ, బోరవానిపాలెం, డ్రైవర్స్ కాలనీ, జేకే లేఅవుట్, కొత్తపరదేశీపాలెం, పాతపరదేశీపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

సాగర్‌నగర్, అక్టోబరు 3 : న్యాయ విద్యార్థులకు చట్టాలపై పూర్తి అవగాహన అవసరమని విజయనగరం పోలీస్ శిక్షణ కళాశాలకు చెందిన పోలీస్ అధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన గీతం యూనివర్సిటీ న్యాయ కళాశాలలో విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకుని, అవసరమైనపుడు ప్రజలకు న్యాయం అందించాలని సూచించారు. స్కూల్ ఆఫ్ లా ఇన్‌చార్జి డాక్టర్ సీహెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ న్యాయ వృత్తిలో ప్రవేశించే వారు వివిధ కోణాల్లో చట్టాలను అవగాహన చేసుకుని విశ్లేషణాత్మకంగా పరిశోధనలు జరపాలని సూచించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

వెంకోజీపాలెం, అక్టోబరు 3 : రాష్ట్రంలోని వరద బాధితులకు ఏయూ అనుబంధ కళాశాలలు ఆర్థిక సాయం ప్రకటించాయి. అనకాపల్లి జిల్లాకు చెందిన షిర్డీసాయి విద్యా పరిషత్, షిర్డీ సాయి లా కళాశాలలు రూ. 25 వేలు చెక్కును రిజిస్ట్రార్ ధనుంజయరావుకు గురువారం అందజేశారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయ నిధికి పంపించాలని కోరారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ఆనందపురం, అక్టోబరు 3 : కణమాం, గిడిజాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌సీ వ్యవసాయ సహాయ సంచాలకుడు చదువుల సబ్రహ్మణ్యం మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం, బిందు సేద్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సంధ్య రత్నప్రభ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శ్వాగ్:** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **దక్షిణ :** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **రామ్‌నగర్ బన్నీ:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 66, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 22, క్యారెట్ 48 దొండకాయలు 48, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 85, బరబటి 50, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయ 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 85, పొటల్స్ 36, కీరదోస 28, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 66, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	108
ఫారం ధర	--	128
విత్ స్కిన్	--	226
స్కిన్‌లెస్	--	236

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..


ఎండాడ : స్వర్ణకవచాలంకృత అలంకరణలో దుర్గాదేవి


మధురవాడలోని టైలర్స్ కాలనీలో విజయ దుర్గాదేవిగా అమ్మవారు


జిమ్‌సర్‌లో దర్శనమిస్తున్న రాజరాజేశ్వరి దేవి


దసపల్లా లేఅవుట్‌లో బాల త్రిపుర సుందరిగా బంగారమ్మ తల్లి

అడుగడుగునా అమ్మ రూపం

- శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- తొలిరోజు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి

భీమునిపట్నం, అక్టోబరు 3 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. భీమిలి పట్టణంలోని కృష్ణాకాలనీలో ఉన్న కల్యాణ వెంకటేశ్వరఆలయంలో పద్మావతి అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు సహస్ర నామ కుంకుమార్చన పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, నాయకులు రేలంగి పెదబాబు, కె. ముత్యాలరావు, సత్యానందరావు, ఆనంద్, సన్నిబాబు, శంకర్,ప్రధానార్చకుడు అప్పలాచార్యులు పాల్గొన్నారు.

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డులోని పలు ప్రాంతాల్లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. టైలర్స్ కాలనీలో అమ్మవారిని విజయ దుర్గాదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మీ, సుబ్బారావు దంపతులు, కమిటీ సభ్యులు అశోక్, యూన్నీ, మాధవి పాల్గొన్నారు. మిథిలాపురి వుడా కాలనీ గాంధీ సెంటర్‌లో కూడా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఆరిలోవ : పెదగదిలి సమీపంలోని సాలిపేట ఈశ్వరదేవీనగర్ కొండవాలు ప్రాంతంలో ఎర్ని మహంకాళి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని అమ్మవారి పీఠాధిపతి అభిరామ్ గురు భవానీ తెలిపారు. మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవీగా పూజలు అందుకున్నారని చెప్పారు.

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు స్వర్ణకవచాలంకృత దేవీ అలంకారంలో పూజలందుకున్నారు. జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు.


భీమిలిలో పూజ చేస్తున్న మహిళలు

అలాగే జిమ్‌సర్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరీ ఆలయంలో తొలిరోజు స్వర్ణ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దసపల్లా లేఅవుట్‌లో ఉన్న బంగారమ్మ ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరిగా పూజలందుకున్నారు.

కొమ్మాది : చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి, తొలి రోజు అమ్మవారిని బాల త్రిపుర సుందరిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్) : తాటితూరులోని కుమ్మరివీధి, చిప్పాడలోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కమిటీ


సింహాచలంలో పూజలు చేస్తున్న భక్తులు


సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : సింహగిరి క్షేత్ర పాలకుడు బాలత్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి సన్నిధితో పాటు 98వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కొండదిగువ తొలిపావంచా వద్ద వరాహలక్ష్మీనృసింహ యూత్ అసోసియేషన్, ఆయిల్ మిల్ వద్ద శ్రీగణేష్ యువజన సేవ సంఘం, గాంధీనగర్‌లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

పద్మనాభం : కోరాడ పంచాయతీ గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి విశేష అర్చన చేశారు. తొలిరోజు అమ్మవారిని స్వర్ణాలంకృత దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.


ఉత్సవాల్లో పాల్గొన్న అభిరామ్ గురు భవానీ


తాటితూరులో సరస్వతీ దేవి అమ్మవారి విగ్రహం


చిప్పాడలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ప్రతిమ

దివ్యాంగ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : జేసీ

కొమ్మాది, అక్టోబరు 3 : దివ్యాంగ విద్యార్థుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ హెచ్చరించారు. బక్కన్నపాలెంలోని విభిన్న ప్రతిభావంతుల ఐటీఐలో విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారని, సరైన వసతి లేదని ఫిర్యాదులు రావడంతో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. ఐటీఐలో మొత్తం ఎంత స్థలం ఉందో వివరాలు కావాలన్నారు. పారా స్టేడియం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని చినగదిలి తహసీల్దార్ పాల్ కిరణ్‌ను ఆదేశించారు. కాగా ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ కూడా దివ్యాంగుల ఐటీఐని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వివరాలు నమోదు చేసుకున్నారు. విద్యార్థులకు అందించాల్సిన పోషకాహారం విషయంలో రాజీ లేదని, అధికారుల తీరు మారకపోతే బాలల హక్కుల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు. ఆయనతో పాటు చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, తదితరులు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న గొండు సీతారామ్

మత్స్యకారులకు 11 ఇంజన్లు వితరణ

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 3 : మండలంలోని పెదనాగమయ్యపాలెంలో 11 పెద్ద బోటు యజమానులకు దివీస్ కంపెనీ ఇంజన్లు సమకూర్చింది. వీటిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా దివీస్ అధికారులు లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గంటా మత్స్యకారులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలో ఉన్న గోస్తనీ నదిలో ఇంజన్ల పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం దివీస్ కంపెనీ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎం రావు మాట్లాడుతూ సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు లోపలికి వేగంగా వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిసి నాలుగు స్ట్రోక్ ఇంజన్ బోట్లు కొనుగోలు చేసి అందించామని తెలిపారు. మొత్తం 11 బోట్లకు రూ. 59.40 లక్షల వ్యయం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దివీస్ సామాజిక సేవా విభాగం మేనేజర్ డి. సురేష్‌కుమార్, ఎంపీడీఓ హనుమంతరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ సభ్యురాలు తోట అరుణ, నాయకులు గరికిన పరశురాము, గురుమూర్తి, పోలీసు దివీస్ అధికారులు శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.

గంభీరంలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

ఆనందపురం : గంభీరం గ్రామంలో దివీస్ కంపెనీ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటు ఏర్పాటుకు దివీస్ సంస్థ 8.25 లక్షల రూపాయలు కేటాయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసుపల్లి లక్ష్మి, ముత్యాలరావు, ఉప సర్పంచ్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


మత్స్యకారుల బోట్లకు ఇంజన్లను అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అప్పన్న ఆలయంలో ఈ నెలలో వైదిక ఉత్సవాలు

సింహాచలం, అక్టోబరు 3 :వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెలలో పలు వైదిక ఉత్సవాలు జరగనున్నాయి. 4న శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం, 5న స్వాతి నక్షత్ర హవనం, 6న నమ్మాళ్వార్ మాస తిరు నక్షత్ర పూజలు,8న వీరలక్ష్మీ ఆరాధన, 9న మూలా నక్షత్రం ఆయుధ పూజ, మనవాళ మహామునుల తిరునక్షత్ర పూజ, 10న స్వర్ణ పుష్పార్చన, 11న సింహవల్లీ తాయర్ సన్నిధిలో సహస్ర నామ కుంకుమార్చన, 12న అనుబంధ ఆలయం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రవణ నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, 13న విజయదశమి సందర్భంగా కొండదిగువ స్వామి వారి పూదోటలో శమీ పూజ, రాత్రి గ్రామ తిరువీధి, 14న ఏకాదశి సందర్భంగా స్వర్ణ తులసీదళార్చన, సింహగిరిపై తిరువీధి జరగనుంది. అలాగే 16న మాస జయంతి, 17న పూర్ణిమ గ్రామ తిరువీధి, 18న తులా సంక్రమణం సింహగిరిపై తిరువీధి, 21న రోహిణీ నక్షత్రం పురస్కరించుకుని మాధవధారలోని వేణుగోపాలస్వామి సన్నిధిలో అష్టాక్షరీ హవనం, 24న పునర్వసు నక్షత్రం సందర్భంగా గంగధార సమీప సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం, 28న ఆండాళ్ మాస తిరు నక్షత్రం, గ్రామ తిరువీధి, 31న బహుళపక్ష చతుర్థశి నరక చతుర్దశి నరకాసుర వధ ఉత్సవం, ధూపసేవానంతర గ్రామ తిరువీధి, 1న అమావాస్య గ్రామ బలిహరణ, స్వాతి నక్షత్ర హవనం, గ్రామ తిరువీధి ఉత్సవాలు జరగనున్నాయి.

రబీలో రాగి పంట మేలు : ఏడీ

పద్మనాభం, అక్టోబరు 3 : రబీ సీజన్‌లో రైతులు రాగి పంట వేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని భీమిలి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ బి. విజయప్రసాద్ చెప్పారు. గురువారం ఆయన కృష్ణాపురం, రెడ్డిపల్లి పంచాయతీ పరిధి రామన్నపేటలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. అవసరమైన రైతులకు రాగి విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తామన్నారు.

పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్య బోధించాలి

వెంకోజీపాలెం, అక్టోబరు 3 : పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్య బోధించాలని, దీని వల్ల యువతలో పర్యావరణ స్పృహ పెరుగుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు అన్నారు. గురువారం వరల్డ్ నేచర్ డే పురస్కరించుకుని ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

'గాంధీజీ బాటలో నడుద్దాం'

వెంకోజీపాలెం, అక్టోబరు 3 : సమాజంలో ఎదురవుతున్న అనేక సమస్యలకు గాంధీ తత్వంలో పరిష్కారాలు చూపవచ్చునని వక్తలు అభిప్రాయపడ్డారు. ఏయూలోని గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో న్యాయ కళాశాలలో నిర్వహిస్తున్న 'ఇష్యూస్ అండ్ చాలెంజెస్ ఆఫ్ జెండర్ జస్టిస్ అండ్ ఈక్వాలిటీ-ఏ గాంధియన్ పర్‌స్పెక్టివ్' అన్న అంశంపై జరుగుతున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. సదస్సులో ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ఏ. ప్రసన్నకుమార్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వి. బాలమోహన్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

మహారాణిపేట, అక్టోబరు 3 : మద్యం పాలసీలో భాగంగా గీత కార్మికులకు కేటాయించిన పది శాతం దుకాణాలకు ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని శెట్టిబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు కోరారు. గురువారం రామ్‌నగర్‌లో ఉన్న ఒక హోటల్‌లో శెట్టిబలిజ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు ఇవ్వనున్న పది శాతం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఈ దుకాణాలను కొంతమంది సిండికెట్లు దక్కించుకోవాలని చూస్తున్నారని, అలా జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు జయరాం, శ్రీనివాస్, రమణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పార్కు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 3 : జీవీఎంసీ 17వ వార్డు ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులోని ప్రశాంతి పార్కులో చేపట్టనున్న ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 15 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పనుల్లో భాగంగా ప్రహరీ, లోపల పరికరాల మరమ్మతులు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్, జోన్ 3 కమిషనర్ శివ ప్రసాద్, నాయకులు కాళ్ల శంకర్, సత్తిబాబు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డిపో వద్ద సీపీఎం ధర్నా



కృష్ణాపురం ఇసుక డిపో వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

భీమునిపట్నం/తగరపువలస, అక్టోబరు 3 : పట్టణంలోని కృష్ణాకాలనీ ఇసుక డిపో వద్ద సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ఇసుక పూర్తిగా లేకుండా చేసి, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని విమర్శించారు. ప్రభుత్వం తీరు వల్ల భవన నిర్మాణ రంగంతో సంబంధం వున్న 64 అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారని చెప్పారు. తక్షణమే ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్. అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, భీమిలి నాయకులు కె.నాగరాణి, భాగం లక్ష్మి, అన్నా బత్తుల నరసింగరావు, బి. గురప్ప, గొరుసు శ్రీను, చిల్ల కొత్తయ్యరెడ్డి, జోగ ఆనంద్, జీరు సత్యారావు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యానికి రాయితీలు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 3 : మండలంలో సూక్ష్మ సేద్యం చేసే రైతులకు పలు రాయితీలు అందిస్తున్నామని ఏఓ శివకోమలి తెలిపారు. గురువారం ఆమె సింగనబంద, తాటితూరు గ్రామాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎకరా నుంచి అయిదు ఎకరాలు ఉన్న వారికి 50 శాతం రాయితీ, అయిదు ఎకరాలు పైబడి ఉన్న వారికి 45 శాతం రాయితీ ఉంటుందన్నారు. అలాగే బిందు సేద్యం పథకానికి 5 ఎకరాల్లోపు ఉన్న వారికి 90 శాతం, 5 ఎకరాలు పైబడిన వారికి 70 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. ఆసక్తి గల రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, ఫొటోతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఆమె వ్యవసాయ సిబ్బందితో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది స్వాతి, కృపామణి, రమేశ్, హరీశ్ పాల్గొన్నారు.

కన్వెన్షన్ సెంటర్ పనుల పరిశీలన

సిరిపురం, అక్టోబరు 3 : వేపగుంట చీమలాపల్లిలో వీఎంఆర్‌డీఏ నూతనంగా నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ భవనాన్ని కమిషనర్ విశ్వనాథన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పెదగంట్యాడ ఓపెన్ ఆడిటోరియం కేఎల్ రావ్‌నగర్ కూర్మన్నపాలెం అగనంపూడి వద్ద సంస్థకు చెందిన భూములను పరిశీలించారు. అలాగే అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి మాడుగులలో అభి వృద్ధికి అవకాశం ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఎస్టేట్ అధికారి శిల్పా, ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, సింగ్, రవిశంకర్ ఉన్నారు.

వినూత్న బోధనతో ఉత్తమ ఫలితాలు : వీసీ

వెంకోజీపాలెం, అక్టోబరు 3 : వినూత్న బోధనతో ఉత్తమ ఫలితాలు వస్తాయని ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు అన్నారు. గురువారం సెనేట్ మందిరంలో ఆర్ట్స్ కళాశాల పరిధిలోని గెస్ట్ ఫ్యాకల్టీతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అందిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ రుసుమును పెంచే దిశగా కృషి చేస్తున్నామన్నారు.త్వరలో డబుల్ డిగ్రీ కోర్సులు ప్రారంభిస్తున్నామని, ప్రతి వ్యక్తి టెక్నికల్ స్కిల్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ధనుంజయ్‌రావు, ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన వివిధ యోగా పోటీల్లో విజేతలుగా నిలచిన విద్యార్థులను వీసీ తన కార్యాలయంలో అభినందించారు. పోటీల్లో భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.